దిగుబడిపై దిగులు

- పండిపోతున్న వర్జీనియా పొగాకు తోటలు
- తుపాను ఎఫెక్ట్ అంటున్న అధికారులు
- పండిన పొగాకు క్యూరింగ్‌కు ఇక్కట్లు
- ఆందోళన చెందుతున్న రైతులు



దేవరపల్లి మండలం కృష్ణంపాలెంలో ఆకులు పండిపోయిన పొగాకు తోట

దేవరపల్లి: మెట్ట ప్రాంతంలో ప్రధాన వాణిజ్య పంటగా సాగవుతున్న వర్జీనియా పొగాకు తోటలకు తుపాను ఎఫెక్ట్ తగిలింది. పంట దిగుబడిపై రైతులు రైతాంగం ఆందోళన చెందుతోంది. డిసెంబరులో ఏర్పడిన మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పొగాకు తోటలు ఎక్కువగా దెబ్బతిన్నాయి. దాదాపు వారం రోజులు కురిసిన వర్షాలకు పొగాకు తోటలు పడిపోయి, తలలు వాల్చాయి. అనంతరం వాతావరణం అనుకూలించడంతో రైతులు తోటల్లో సస్య రక్షణ చర్యలు చేపట్టి పైపాట్లు చేయడంతో తోటలు చాలా వరకు నిలదొక్కుకున్నాయి. తోటల ఎదుగుదల ఆశాజనకంగా ఉండడంతో దిగుబడి బాగుంటుందని ఆశించారు. ప్రస్తుతం రోజురోజుకు ఎండల తీవ్రత పెరుగుతుండడంతో తోటలు పక్వానికి రాకుండానే పండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తోటలు ముగ్గిపోవడంతో ఆకురెలుపులు, క్యూరింగ్‌కు ఇబ్బంది కలుగుతుందని రైతులు వాపోతున్నారు. పండిన ఆకులను క్యూరింగ్ చేస్తే గుల్లబారిపోతున్నాయని, దీని వల్ల దిగుబడి గణనీయంగా తగ్గుతుందని రైతులు తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 19779 హెక్టార్లలో పొగాకు సాగు చేస్తున్నారు.

దెబ్బతిన్న వేరు వ్యవస్థ

తుపాను సమయంతో వీచిన ఈదురు గాలులు, భారీ వర్షాలకు పొగాకు మొక్కలు పడిపోయాయి. వీటిని రైతులు నిలబెట్టి మొక్కమొదల మట్టి వేశారు. ఆసమయంలో మొక్క తల్లివేరు కదలడం వల్ల వేరు వ్యవస్థ దెబ్బతిన్నట్టు అధికారులు చెపుతున్నారు. వేరు వ్యవస్థ దెబ్బతినడంతో మొక్కకు పోషకాలు అందడంలేదని, దీన వల్ల ఆకులు పండిపోతున్నాయని అధికారులు అంటున్నారు. భూమిలో సత్తువలేని నేలలు, పోషకాలు లేని నేలల్లో వేసిన తోటలు ఆరోగ్యవంతంగా లేక ఆకులు తోడుకోవడంలేదని అధికారులు తెలిపారు. పశువుల ఎరువు, సేంద్రియ ఎరువు, పచ్చిరొట్ట ఎరువు వేసిన తోటలు బాగున్నాయని బోర్డు అధికారులు తెలిపారు. కైలుదారీ వ్యవస్థలో నేల ఆరోగ్యం గురించి పట్టించుకోవడం లేదని, దీన వల్ల భూసారం తగ్గిపోతుందని అంటున్నారు.

అకాల వర్షాల వల్లే..



పొగాకు తోటలకు డిసెంబరులో కురిసిన అకాల వర్షాల షాక్ తగిలింది. షాక్ నుంచి తోటలు తేరుకోలేదు. మొక్క వేరు వ్యవస్థ దెబ్బతినడం వల్ల వేసిన ఎరువు పూర్తిగా మొక్కకు అందడంలేదు. కాలం మారడం వల్ల మొక్క తట్టుకోలేదపపోతుంది. ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. తోటలు తిరగబడి పండిపోతున్నాయి. కండకలిగిన నేలలు, సుస్థిర పోషకాలు ఉన్న తోటలు తట్టుకుంటున్నాయి. పండిపోతున్నా తోటలకు పొటాషియం నైట్రేట్ ఎరువును డ్రిప్ ద్వారా గాని, స్ప్రే ద్వారా గాని మొక్కకు అందిస్తే కొంత వరకు ఉపయోగం ఉంటుంది. దీనివల్ల పొగాకు నాణ్యత బాగుంటుంది. బోదెల్లో పలుచగా నీరు పారించడంతో తోటలు కోలుకొనే అవకాశం ఉంటుంది. వర్షాలకు మనేదలు(గ్యాప్) ఎక్కువగా ఉండడంతో తోటల ఎదుగుదల ఎత్తుపల్లాలు ఉన్నాయి. ప్రధానంగా నేలలో పోషకాలు తగ్గడం, రైతులు అశ్రద్ధ కారణంగా పంటకు పోషకాలు అవసరానికి సరిపడా అందడంలేదు.

– జీఎల్‌కే ప్రసాద్, పొగాకు వేలం నిర్వహణాధికారి, దేవరపల్లి

ఎండలు ఎక్కువగా ఉండడంతో...



పొగాకు తోటలు నిలువునా పండిపోతున్నాయి. వారం రోజులుగా ఎండలు ఉండడంతో ఎక్కువగా ఉండిపోతున్నాయి. తోటలకు తుపాను ఎఫెక్ట్ ఎక్కువగా ఉంది. వర్షాల అనంతరం తోటలు కోలుకున్నప్పటికి మొక్క ఆకులు పూర్తిగా పండిపోతున్నాయి. పండిన ఆకులు క్యూరింగ్ చేయడానికి ఇబ్బందులు పడుతున్నాం. ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్లు దిగుబడి తగ్గుతుంది. పండిన పొగాకు రంగులు కూడా సరిగా రావడంలేదు.

– సత్తి జగదీశ్వరరెడ్డి, రైతు, కృష్ణంపాలెం, దేవరపల్లి మండలం

క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ



మున్సిపల్ చైర్మన్‌ను కలుసుకున్న కమిషనర్

నిడదవోలు: నిడదవోలు మున్సిపల్ కమిషనర్‌గా కోన శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల బదిలీలలో భాగంగా ఇక్కడ పనిచేసిన కేవీ పద్మావతి పెద్దాపురం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్ ఇక్కడకు వచ్చారు. కోన శ్రీనివాస్ ఏపీ సచివాలయంలో పదేళ్ల సెక్షన్ అధికారిగా పనిచేశారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణకు పుష్పగుచ్ఛం అందించి ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మున్సిపల్ డీఈఈ మాధవి, ఏఈ హేమంత్, మున్సిపల్ ఆర్ఐ వెంకటేశ్వరరావు, మున్సిపల్ మేనేజర్ బి.శ్రీలక్ష్మి, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు సీహెచ్ ఉదయ్‌కుమార్‌తో పాటు మున్సిపల్ ఉద్యోగులు కొత్తగా వచ్చిన కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

పూర్వ విద్యార్థుల సాయం



ఊనగట్ల జెడ్పీహైస్కూల్‌లో పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన షెడ్

చాగల్లు: ఊనగట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు పాఠశాల సిబ్బంది వాహనాల పార్కింగ్ స్థలంలో నూతనంగా ఏర్పాటు షెడ్‌ను సోమవారం ప్రారంభించారు. పాఠశాలలో 1982–87 వరకు చదివిన పూర్వ విద్యార్థులు దాతృత్వంతో షెడ్‌ను ఏర్పాటు చేసినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్‌వీ రమణ తెలిపారు. పాఠశాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనలో పూర్వ విద్యార్థుల సహకారంతో అభినందనీయమని పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు నందిగం శ్రీనివాసరావు అన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థిని, కలవలపల్లి ఎంపీటీసీ ముళ్లపూడి గంగాభవాని, ఎల్.శ్రీనివాసరావు, బి.రామకృష్ణ, కె.లక్ష్మీనారాయణ, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల సవరణకు 1201 దరఖాస్తులు

తాళ్లపూడి: ఓటర్ల జాబితాలో సవరణలకు 1201 దరఖాస్తులు అందాయని తహసీల్దార్ శ్రీనివాస్ సోమవారం తెలిపారు. తుది ఓటర్ల జాబితాలో తప్పుల సవరణలో భాగంగా ఎన్నికల సంఘం జనవరి 22న ఓటర్ల తుది జాబితాను విడుదల చేసింది. జాబితా సరి చూసుకుని అభ్యంతరాలకు అవకాశం కల్పించారు. దీనిపై గత నెల 22వ తేదీ నుంచి ఈ నెల పదో తేదీ వరకూ సమయం ఇచ్చారు. దీనిపై అప్పటి నుంచి ఈ నెల 10 వరకు ఓటర్లకు అభ్యంత దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇప్పటి వరకూ 1201 దరకాస్తులు అందాయని తహసీల్దార్ తెలిపారు. తల్లి తండ్రులు పేర్లు మార్పు, చనిపోయిన వారి పేర్ల తొలగింపు, డోర్ నెంబర్ మార్పులు, ఫోటోలు మార్పు, ఇతర మార్పులు చేర్పులు సరి చేసే కార్యక్రమంలో బీఎల్‌వోలు బిజీగా ఉన్నారు.

కొవ్వూరు నుంచి అయోధ్య-కాశీ యాత్ర బస్సు

కొవ్వూరు: అయోధ్య-కాశీ యాత్ర బస్సు సోమవారం కొవ్వూరు ఆర్టీసీ డిపో నుంచి బయలుదేరింది. డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. 10 రోజుల పాటు మార్గమధ్యలో 14 క్షేత్రాలను సందర్శించనున్నట్టు ఆయన తెలిపారు. యాత్రీకులకు బస్సులోనే టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి టిఫిన్ అందిస్తామన్నారు. ఒక్కోయాత్రీకుడికి రూ.11,500 చొప్పున చార్జీ వసూలు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ బస్సు పది రోజులు పాటు ప్రయాణం చేసి తిరిగి కొవ్వూరు చేరుకుంటుందన్నారు. మళ్లీ ఈ నెల 10వ తేదీన మరో బస్సు బయలుదేరుతుందన్నారు. ఈ బస్సు 19 క్షేత్రాలను 13 రోజుల పాటు చుట్టుముట్టి వెళుతుందన్నారు.

సీఎంను కలిసిన తలారి



సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన తలారి వెంకట్రావు

కొవ్వూరు: అసెంబ్లీ సమావేశాల్లో అమరావతి వెళ్లిన ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. అప్యాయంగా పలకరించి నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి గురించి ఆరా తీసినట్టు ఆయన తెలిపారు.

కోటసత్తెమ్మను దర్శించుకున్న కమిషనర్ వాణీమోహన్



తిమ్మరాజుపాలెంలో వాణీమోహన్‌కు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ చైర్మన్, ఈఓ

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెం గ్రామంలోని కోటసత్తెమ్మ అమ్మవారిని రాష్ట్ర పురావస్తు, మ్యూజియం శాఖ కమిషనర్ జి.వాణిమోహన్ సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాణీమోహన్‌కు ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం(శివ) ఘనంగా స్వాగతం పలికి, అమ్మవారి చిత్రపటాన్ని అందించి సన్మానించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నిడదవోలు మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్, సమిశ్రగూడెం ఎస్సై ఎస్ఎస్‌వీవీ రమేష్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ధర్మకర్తల మండలి సభ్యులు గాజుల రంగారావు, అయినీడి వెంకటకృష్ణ, మిద్దే శ్రీను, వద్దిరెడ్డి మహాలక్ష్మి, ప్రధాన అర్చకులు అప్పారావు శర్మలు పాల్గొన్నారు.

ఆలయ ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్

పెరవలి: అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయానికి ధర్మకర్తల మండలి నియమాకానికి దేవదాయ ధర్మశాఖ ఉప కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆలయానికి ధర్మకర్తల మండలిలో సభ్యులుగా చేయడానికి ఆసక్తి ఉన్న వారు 20 రోజుల లోపు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు.

ముమ్మరంగా రిజిస్ట్రేషన్లు

పర్యవేక్షించిన తహసీల్దార్ కృష్ణారావు



అనంతపల్లి సచివాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో లబ్ధిదారులు

నల్లజర్ల: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం లబ్ధిదారులకు డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగంగా జరుగుతోంది. మండలంలోని అన్ని సచివాలయాల్లో ఆదివారం సైతం రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరిగింది. మండలంలో ప్రభుత్వ భూమి కాక దాదాపు 60 ఎకరాల ప్రైవేటు భూమిని ప్రభుత్వం కొనుగోలు చేసింది. 51 లేఅవుట్లను అభివృద్ధి చేసి 2,500 మందికి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు పంపిణీ చేసింది. ఈలబ్ధిదారులకు వీఆర్వో, పంచాయతీ కార్యదర్శుల ద్వారా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తున్నారు. ఆది, సోమవారాల్లో 130 మంది వరకూ రిజిస్ట్రేషన్లు జరిగాయి. తహసీల్దారు కృష్ణారావు, డిప్యూటీ తహసీల్దారు కిశోర్‌కుమార్ పోతవరం, తెలికిచెర్ల, దూబచర్ల తదితర గ్రామాల్లో జరుగుతున్న ఈ ప్రక్రియను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా రిజిస్ట్రేషన్ల నమోదు పూర్తి చేసే దిశగా చర్యలు చేపడుతున్నట్టు వారు వెల్లడించారు. సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళుతున్నట్టు చెప్పారు. లబ్ధిదారులు ఉత్సాహంగా తమ పట్టాలు రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యం

- చిక్కాల కబడ్డీ జట్టుకు అభినందనలు
- ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు



కబడ్డీ జట్టును అభినందిస్తున్న ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి

చాగల్లు: ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు అన్నారు. ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానం పొందిన చాగల్లు మండలం చిక్కాల కబడ్డీ జట్టు క్రీడాకారులను ఆయన ఆదివారం సాయంత్రం అభినందించారు. ఈ సందర్భంగా తలారి వెంకట్రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించి, వారిలో నైపుణ్యతను వెలికి తీసేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు ఏర్పాటు చేసిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి క్రీడలపై ఉన్న మక్కువతో యువతకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. క్రీడాకారులు ఇదే ఉత్సాహంతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో గెలుపు సాధించి జిల్లాకు కొవ్వూరు నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సుంకర రాయుడు, సర్పంచ్ కొయ్యే మణి, కార్పొరేషన్ డైరెక్టర్ సంసాని రమేష్, చిటికెన బాబి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు



శ్రీనివాసరావు, తాళ్లపూడి తహసీల్దార్



సావిత్రి, చాగల్లు తహసీల్దార్



ఆచారి, దేవరపల్లి తహసీల్దార్



కె హిమ మహేశ్వరి, పెరవలి ఎంపిడిఓ



ఎజిఎస్ మూర్తి, పెరవలి ఎస్ఐ



శ్రీనివాసరావు, కొవ్వూరు రూరల్ సీఐ



వి.నాగభూషణం, నిడదవోలు తహసీల్దార్

తాళ్లపూడి: మండల తహసీల్దార్‌గా సీహెచ్ శ్రీనివాసరావు సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికలు నేపథ్యంలో జరిగిన బదిలీల్లో భాగంగా ఆయన అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డివిజన్ వై.రామవరం మండలం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ భారతి, ఆర్ఐ కిషోర్, మండల ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు, ఇతర కార్యాలయ సిబ్బంది నూతన తహసీల్దార్‌కి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

చాగల్లు: మండల తహసీల్దారుగా ఎం.సావిత్రి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె ఇప్పటివరకు అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం సబ్ కలెక్టర్ ఆఫీసులో ఏఓగా పనిచేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా చాగల్లు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన కె.రాజ్యలక్ష్మి ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం తహసీల్దారుగా బదిలీపై వెళ్లారు. నూతన తహసీల్దార్‌కు కార్యాలయం సిబ్బంది, వీఆర్వోలు, గ్రామ సచివాలయం సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

దేవరపల్లి: దేవరపల్లి తహసీల్దార్‌గా నియమితులైన వైవీఎస్ ఆచారి సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. తూర్పు గోదావరి జిల్లా రాజవొమ్మంగి మండలం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎం.రామకృష్ణ కృష్ణా జిల్లా కంకిపాడు బదిలీపై వెళ్లారు. నతన తహసీల్దార్‌ను కార్యాలయం డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, సిబ్బంది తహసీల్దార్ ఆచారిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

ఎంపీడీవోగా బుజ్జి బాధ్యతల స్వీకరణ



జేఏ రుూన్సీ, నిడదవోలు ఎంపీడీఓ

చాగల్లు: మండల ఎంపీడీవోగా ఎస్.బుజ్జి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కొనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ఎంపీడీవోగా బాధ్యత నిర్వహించి సాధారణ బదిలీలో భాగంగా చాగల్లు వచ్చారు. ఇంతవరకు ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవో పనిచేసిన పి.నిర్మలాకుమారి కార్యాలయం సూపరిండెంటెంట్‌గా కొనసాగుతారు. ఎంపీడీవోగా బుజ్జి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఎంపీపీ మట్టా వీరాస్వామి, జెడ్పీటీసీ గారపాటి విజయదుర్గ, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పెరవలి: స్థానిక ఎంపీడీఓగా కె.హిమ మహేశ్వరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. పెరవలి ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఏజీఎస్ మూర్తి పశ్చిమ గోదావరి వీఆర్ నుంచి బదిలీపై పెరవలి వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ ఇరువురు అధికారులను కలసి శుభాకాంక్షలు తెలిపారు. ధాయనతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు వీరికి అభినందనలు తెలిపారు.

కొవ్వూరు రూరల్ సీఐగా శ్రీనివాసరావు

కొవ్వూరు: కొవ్వూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పి.శ్రీనివాసరావు సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన వైవీ రమణ మలిచిపట్నం ట్రాఫిక్ సీఐగా బదిలీ అయ్యారు.1998 బ్యాచ్‌కి చెందిన శ్రీనివాసరావు గతంలో ఏలూరు త్రీటౌన్, కాకినాడ త్రీటౌన్ సీఐగాను, విజయవాడ సీసీఎస్ సీఐగా పని చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విజయవాడ నుంచి బదిలీపై కొవ్వూరు వచ్చారు.

ఉండ్రాజవరం: మండల తహసీల్దార్‌గా కె.నవీన్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ జి.కనకరాజు రాజానగరం మండలానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కృష్ణాజిల్లా మోపిదేవి మండలంలో పని చేసిన నవీన్‌కుమార్ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా వీఆర్వోల మండల అధ్యక్షుడు వేలిచేటి పాపారావు, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.



నవీన్‌కుమార్‌కి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికిన వీఆర్వోలు

నిడదవోలు రూరల్: నిడదవోలు తహసీల్దార్‌గా వి.నాగభూషణం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ ఎన్నికల్లో బదిలీల్లో భాగంగా కృష్ణా జిల్లా పెదపారుపూడి మండలం నుంచి ఇక్కడకు వచ్చారు. ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని ఆయన చెప్పారు. నిడదవోలు తహసీల్దార్‌గా పని చేసిన ఎం.గంగరాజు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొంది రూడా కార్యదర్శిగా బదిలీపై వెళ్లారు. నాగభూషణంను కార్యాలయ అధికారులు, వీఆర్వోలు, వీఆర్ఏలు, సచివాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

నిడదవోలు ఎంపీడీఓగా జేఏ రుూన్సీ సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బిక్కవోలు ఎంపీడీఓగా పని చేసిన రుూన్సీ ఇక్కడకు బదిలీపై వచ్చారు. తాడిమళ్లలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మిని ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీడీఓ రుూన్సీకి కార్యాలయ ఏఓ రత్నరాజు, ఈఓపీఆర్డీ రత్నమాలిక, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ, కార్యాలయ సిబ్బంది అభినందించారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన పి.శామ్యూల్ కృష్ణా జిల్లాకు బదిలీపై వెళ్లారు.

సమిశ్రగూడెం ఎస్సైగా ఎస్ఎస్‌వీవీ రమేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పెనుగొండ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన షేక్ సుభానీ పెనుగొండ బదిలీపై వెళ్లారు. రమేష్‌ను ఏఎస్సైలు పరమహంస, ఆంజనేయులు, స్టేషన్ సిబ్బంది, సచివాలయ మహిళా పోలీసులు కలిసి అభినందనలు తెలిపారు.

నిడదవోలు అభివృద్ధే లక్ష్యం

మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ



ఆరో వార్డులో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్

నిడదవోలు: నిడదవోలు అభివృద్ధే లక్ష్యంగా పట్టణంలోని అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. పట్టణంలోని 6వ వార్డు మసీదు వీధిలో సోమవారం ఆయన మున్సిపల్ సాధారణ, 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.30.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీరోడ్లు, సీసీ డ్రైన్‌లకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లో పట్టణ ప్రజల అవసరాల మేరకు ప్రాధాన్యత క్రమంలో సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మిస్తున్నామన్నారు. రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకొని పట్టణంలోని ప్రధాన సెంటర్లలో నాలుగు లేన్ల సీసీ రోడ్డు విస్తరణ పనులు చేపట్టామన్నారు. పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వ నిధులతో పార్కులను కూడా అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి గాజుల రంగారావు, కౌన్సిలర్ వువ్వుల రతీదేవి, మున్సిపల్ డీఈఈ మాధవి, ఏఈ హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన మాజీ మంత్రి కారుపాటి



పార్టీలో చేరిన వివేకానందతో నాయకులు

కొవ్వూరు: గోపాలపురం మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కారుపాటి వివేకానంద సోమవారం భారతీయ జనతా పార్టీలో చేరారు. కొవ్వూరు పరిమి రామారాయుడు రత్తమ్మ కల్యాణ మండపంలో వివేకానందకు బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పరిమి రాధాకృష్ణ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. 1983, 1985, 1989 ఎన్నికల్లో ఆయన మూడుసార్లు టీడీపీ తరుపున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఎన్టీఆర్ హయాంలో ఈయన సమాచార, క్రీడలు, సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రిగా సుమారు పది నెలల పాటు పని చేశారు. గత కొన్నేళ్లుగా రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు మడిచర్ల రామచంద్రరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లల మర్రి మురళీకృష్ణ, నియోజకవర్గ కన్వీనర్ మాట్లా ఆంజనేయులు నాయకులు కొండపల్లి రత్నసాయి, గెల్లా కేశవ, జడ్ఏ బేగ్, ఆలపాటి రామకృష్ణ, ఆర్.వెంకటలక్ష్మి, రాణా ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.